ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 12: దూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వచ్చే బాధితుల సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు వింటూ జేసీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు నిర్ణీత గడువులోగా పరిష్కారాలు చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉదయం 9-30 గంటల నుంచి 10-30 గంటల వరకు నిర్వహించిన డయల్ యవర్ కలెక్టర్ కార్యక్రమానికి ఫోన్ ద్వారా 10 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూశాఖాధికారి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు వెంకటాద్రి, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.3లక్షల విరాళం

● సీఎం చంద్రబాబుకు ఇచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 12: ఆంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.3 లక్షల 1116 విరాళంగా అందజేశారు. సోమవారం ఆయన సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి తన మొదటి నెల జీతం రూ.3,01,116లు చెక్కును విరాళంగా అందజేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి : ఎస్పీ

కడప (క్రైం), ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు



ఆయనో.. టర్న్‌కీ

పులివెందుల నియోజకవర్గ ఎస్పీడీసీఎల్ పనుల్లో అవినీతి గుట్టు రట్టవుతూ వస్తోంది. అక్కడ తిష్టవేసిన ఓ సారు అన్నీ తానై వ్యవహరిస్తూ అన్నం పెట్టిన సంస్థకే సున్నంవేసి కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ మాయాజాలం బయటపడకుండా ఉండేందుకు ఆ అవినీతి సొమ్మును జగన్ హయాంలో వైసీపీ నేతలకు వాటాలిచ్చి వారి ప్రాపకం పొందగా.. ఇప్పుడు అదే సొమ్మును టీడీపీ నేతలకు ఇచ్చి అక్కడే సెటిల్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయన అందరిలా ఓ సాధారణ సారే అయినప్పటికీ తన చాకచక్యంతో పులివెందుల వైసీపీ నేతలను గుప్పిట్లో పెట్టుకుని ఆ పవర్‌తో నేరుగా తిరుపతిలోని సీఎండీ కార్యాలయంతోనే బాగా కనెక్ట్ అయి శాసిస్తారంటారు. అప్పుడు వైసీపీలో ఇప్పుడు టీడీపీలో చక్రం తిప్పడంలో సిద్ధహస్తుడు. చేయని పనులకు చేసినట్లు బిల్లులు సిద్ధం చేయడంలో.. తక్కువ ఖర్చుకు ఎక్కువగా ఎస్టిమేట్లు వేయడంలో.. అసలు ఎస్పీడీసీఎల్ మెటీరియల్‌నే పక్కదారి పట్టించడంలో నేర్పరి. వెరసి ఆయనో టర్న్‌కీ అని ఆ సంస్థ ఉద్యోగులే పేర్కొంటున్నారు.

● పులివెందుల ఎస్పీడీసీఎల్‌లో..
● ఆ సారు అన్నీ తానై వ్యవహరిస్తారు
● బినామీలతో కాంట్రాక్టు పనులు
● పాడా నిధులూ ఫలహారమే
● సంస్థ మెటీరియల్‌నే టర్న్‌కీ పనులకు వాడుకున్న వైనం
● కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ముకు స్వాట్
● విజిలెన్స్ సీఐడీ విచారిస్తే బద్దలు కానున్న కుంభకోణం

(కడప-ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్‌లో ఉమ్మడి కడప జిల్లాకు కడప ఎస్ఈ బాస్. ఏదైనా ఇక్కడి నుంచే నిబంధనల ప్రకారం తిరుపతిలోని సీఎండీ కార్యాలయానికి వెళుతుంటాయి. అయితే ఆ సారు మాత్రం పులివెందుల నుంచి నేరుగా తిరుపతితో కనెక్ట్ పెట్టుకుని శాసిస్తున్నారంటారు. ఎంతలా అంటే కడప జిల్లా విద్యుత్‌శాఖకు ఆ సారే బాస్ అనే స్థాయికి చేరిందంటారు. ఇక పాడా నిధులతో చేపట్టిన విద్యుత్ పనుల్లో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు పులివెందుల, వేంపల్లెలో జరిగిన రోడ్ల పనుల విస్తరణలో కూడా ఆ సారు తనదైన స్టైల్‌లో ముద్ర వేశారంటారు. లక్ష ఐదు లక్షలు పదిలక్షలు కాదు... ఏకంగా రూ.17.45 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు నిర్వహించి భారీ ఎత్తున గోల్‌మాల్ చేశారంటారు. సొంత సంస్థ మెటీరియల్‌నే టర్న్‌కీ పనులకు వాడేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడీ వ్యవహారం ఎస్పీడీసీఎల్‌లో సంచలనంగా మారింది.

టర్న్‌కీలోనూ వదల్లేదు

జగన్ హయాంలో పులివెందుల సమగ్రాభివృద్ధి కోసం పాడాను ఏర్పాటు చేశారు. వందల కోట్లు కుమ్మరించారు. రోడ్లు, పాఠశాల బిల్డింగులు ఇతర విద్యుత్ పనులుతో పాటు పులివెందుల, వేంపల్లెలో రహదారుల విస్తరణ పనులు కూడా చేపట్టారు. రహదారి విస్తరణ పరంగా విద్యుత్‌లైన్లు మార్చడం, షిఫ్టింగ్, కొత్తలైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి అంచనా వ్యయం మేరకు ఆర్‌అండ్‌బీ వారు ఎస్పీడీసీఎల్‌కు డబ్బులు చెల్లిస్తే టర్న్‌కీ ద్వారా పనులు చేపడతారు. కొత్తగా లైను వేయాలన్నా, షిఫ్టింగ్ చేయాలన్నా ఇదే పద్ధతి. టర్న్‌కీ అంటే ఎస్పీడీసీఎల్‌లో రిజిస్టరు చేసుకున్న కాంట్రాక్టర్లు. ఉదాహరణకు.. కడపలోని కోటిరెడ్డిసర్కిల్ నుంచి నాగరాజుపేట వరకు విద్యుత్‌లైను వేయాల్సి ఉంటే సంబంధిత ఏఈ వెళ్లి ఎన్నిస్తంభాలు పడతాయి, ఎంత కేబుల్ అవసరం, అవన్నీ చూసి ఎస్టిమేట్ వేస్తారు. రూ.10లక్షలు అంచనా వ్యయం అవుతుందనుకుంటే ఆ మేరకు పనులు చేయాలంటే ఎస్టిమేట్ కాస్ట్‌పై 15 శాతం డబ్బులు చెల్లించాలి. చెల్లిస్తే తరువాత రిజిస్టరు చేసుకున్న కాంట్రాక్టర్ల (టర్న్‌కీ) ద్వారా పనులు చేసుకోవచ్చు. ఈ 15 శాతం డబ్బు ముందుగా చెల్లించడం ఎందుకంటే వర్క్ సూపర్‌వైజింగ్‌తో పాటు మెటీరియల్ నాణ్యత పరిశీలిస్తారు. మెటీరియల్ కొనుగోలు చేశాక సంబంధిత ఏఈ వద్ద చెక్ చేయించుకోవాలి. మెటీరియల్ నిబంధనల మేరకు క్వాలిటీ ఉన్నాయా, కొలతలు ఉన్నాయా అనేది చెక్ చేసి అర్హత ఉంటేనే పనులకు అనుమతిస్తారు. ఏ ఎస్టిమేట్ పనులు అయినా జూనియర్ ఇంజనీరు, అసిస్టెంటు ఇంజనీరు సంతకాలు పెట్టి నిర్వహించాలి. అయితే పులివెందుల, వేంపల్లెలకు చెందిన రోడ్ల పనుల విస్తరణ ఎస్టిమేట్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రమేయం లేకుండానే ఆ సారు ఎస్టిమేట్లు వేసి పంపించారని చెబుతున్నారు. లైన్‌షిఫ్టింగ్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా ఆర్‌అండ్‌బీ అధికారులు డబ్బులు చెల్లించాల్సి ఉండడంతో.. అంచనాలు పెంచేసి వేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇలా పంపించే ఎస్టిమేట్‌లకు కడపలోని విద్యుత్ భవన్‌లో ఎస్ఈ ఆఫీసులో అనుమతులు ఇవ్వకపోవడంతో.. వైసీపీ హయాంలోనే పులివెందుల పవర్ ద్వారా ఆ సారు తిరుపతిలో మేనేజ్ చేయించి నిర్మించుకున్నారంటారు. రోడ్ల విస్తరణకు సంబంధించి పులివెందులలో జమ్మలమడుగు, కదిరి రోడ్డులో లైన్‌షిఫ్టింగ్ రూ.199లక్షలు, పులివెందుల టౌన్‌లో 11కేవీ యూజీ కేబుల్‌కు సంబంధించి రూ183.70లక్షలు, వేంపల్లెలో కూడా రోడ్ల విస్తరణకు సంబంధించి టోటల్‌గా టర్న్‌కీ ద్వారా పనులు చేపడుతున్నారు. ఇక్కడ పులివెందుల, వేంపల్లెలో 13 వర్క్‌లతో తన బినామీలతోనే ఈ పనులు చేయించినట్లు సమాచారం. పాడా నిధులతో పెద్దఎత్తున విద్యుత్ పనులు చేపట్టినట్లు లెక్కలు చూపించారు. అత్యవసర పనుల కోసం విద్యుత్‌లైన్లు, కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసినట్లు పాడాలో చూపించారంటారు. అలా అడ్డంగా డ్రా చేసిన మెటీరియల్‌ను టర్న్‌కీ పనుల్లో వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై సీఐడీ లేదా విజిలెన్స్ బృందం విచారిస్తే భారీ కుంభకోణం బయటపడుతుందని చెబుతున్నారు.

టీడీపీ నేతల ప్రాపకం కోసం..

జగన్ హయాంలో పాడా నిధులతో చేపట్టిన పనుల్లో పెద్దఎత్తున ఆరోపణలున్నాయి. స్థానిక వైసీపీ నాయకులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా చేశారంటారు. పాడా నిధుల దుర్వినియోగంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు విచారణకోసం పట్టుబడుతున్నారు. అయితే ఈ వ్యవహారం గుట్టురట్టు కాకుండా ఉండేందుకు ఆ సారు టీడీపీ నేతల ప్రాపకం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వైసీపీ నేతలకు సహకరించినట్లుగానే మీకు సహకరిస్తామని ఆఫర్ ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

స్కూల్ వ్యాను బోల్తా

● చిన్నారి మృతి ● విద్యార్థులకు గాయాలు ● శోకసంద్రంగా ఘటన ప్రాంతం

ఓబులవారిపల్లె, ఆగస్టు 12: పెళ్లయిన ఎన్నో ఏళ్లకు పుట్టిన బిడ్డ.. అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మానాన్నలతో ఆనందంగా గడిపిన ఆ చిన్నారి సోమవారం స్కూల్‌కు వెళ్లేందుకు ఎంతో ఆనందంగా ఇంట్లో అందరికీ టాటా చెబుతూ స్కూల్ వ్యాను ఎక్కింది. పది నిమిషాల్లో స్కూల్‌కు చేరాల్సి ఉండగా వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడటంతో రెండో తరగతి చదువుతున్న వీరంరెడ్డి భవిష్యరెడ్డి (7) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన ఓబులవారిపల్లెలో సోమవారం ఉదయం 8 గంటలకు జరిగింది. మండల కేంద్రంలోని ఓబులవారిపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అరుణ దంపతులకు పుట్టిన మొదటి సంతానం వీరంరెడ్డి భవిష్యరెడ్డి (7) చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె గ్రామానికి దగ్గరగా ఉన్న శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఓబులవారిపల్లె నుంచి సుమారు 15 మంది విద్యార్థులతో కలిసి స్కూల్ వ్యాన్ బయలుదేరి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మార్గమధ్యలో ఉన్న పాములేరు బ్రిడ్జిని దాటుకోగానే వాహనం స్టీరింగ్ పట్టేయడంతో అదుపు తప్పి ఎడమవైపు రక్షణగా ఉన్న సిమెంట్ దిమ్మెలను గుద్దుకుంటూ రోడ్డుపై నుంచి సుమారు 10 అడుగుల లోతులో ఉన్న మట్టిరోడ్డుపై పడిపోయింది. దీంతో విద్యార్థులు ఒకరిపై ఒకరు పడ్డారు. ఈ ఘటనలో వీరంరెడ్డి భవిష్యరెడ్డి ఫుట్‌పాత్‌కు మధ్యలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన గమనించిన ప్రజలు స్కూల్ వ్యాను అద్దాలు పగులగొట్టి విద్యార్థులను రక్షించారు. విద్యార్థులు వెళుతున్న వాహనం ప్రమాదానికి గురై ఒక పాప మృతి చెందడంతో ఓబులవారిపల్లె మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. వ్యాను ప్రమాదానికి గురైన ఘటనను తెలుసుకున్న ఓబులవారిపల్లె తహసీల్దార్ పీర్‌మున్ని సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదేవిధంగా రైల్వేకోడూరు సీఐ బాబు, ఎస్ఐ మహేష్‌లు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి పాఠశాల కరస్పాండెంట్ సత్యకుమార్‌ను అడిగి వివరాలు సేకరించారు. డీఎస్పీ రామచంద్ర గౌడ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి హాజరై పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పలువురు అధికారులు వెల్లడించారు.

విద్యార్థి సంఘ నాయకుల ఆగ్రహం

కండీషన్ లేని వాహనాలు, నైపుణ్యంలేని డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు నాయకులు ఆరోపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందాలని, పరిమితికి మించి విద్యార్థులను ఒకరిపై ఒకరు కూర్చోబెట్టి తీసుకెళ్లడం, వాహనాలను తక్కువ పెట్టి ఎక్కువ మంది విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడంతో నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులకు కడుపుశోకాన్ని మిగిలిస్తున్నారని, అధికారులు, నాయకులు ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



భవిష్యరెడ్డి (ఫైల్)




వ్యాన్ ఫుట్‌పాత్‌లో ఇరుక్కుపోయి మృతి చెందిన భవిష్యరెడ్డి



బోల్తా పడ్డ వ్యాన్ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కాల్వలు పూర్తయ్యేనా.. గంగ వచ్చేనా..

పంట పొలాలకు నీరందించాల్సిన తెలుగుగంగ కాల్వల నిర్మాణం దశాబ్దాలుగా అసంపూర్తిగానే నిలిచిపోయాయి. దీనికి తోడు కాల్వల కోసం పొలాలు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. అటు పరిహారం అందక, ఇటు కాలువ నిర్మాణం పూర్తికాక రైతులు ఇబ్బంది పడుతున్నారు.



దమ్మనపల్లె వద్ద అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాల్వ

● అసంపూర్తిగా తెలుగుగంగ పిల్ల కాల్వలు
● ఇప్పటికీ రైతులకు అందని నష్టపరిహారం ● కొత్తప్రభుత్వంలోనైనా కార్యరూపం దాల్చేనా..

పోరుమామిళ్ల, ఆగస్టు12: బద్వేలు నియోజకవర్గ రైతులకు వరప్రసాదిని అయిన తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే ఉద్దేశ్యంతో దశాబ్దాల క్రితం కాల్వల నిర్మాణాలు లైనింగ్ పనులు, పిల్ల కాల్వల పనులు ప్రారంభించారు. కానీ నాయకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా కాల్వల నిర్మాణం పెండింగులో పడిపోయాయి. పోరుమామిళ్ల చెరువును రిజర్వాయరుగా ప్రకటించారు. ఇందులో నీళ్లు నింపి ఇక్కడి నుంచి అన్ని చెరువులకు నీరు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఏళ్లవుతున్నా.. పిల్లకాల్వలు మాత్రం ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి.

ఎప్పటికి పూర్తయ్యేనో..

పోరుమామిళ్ల ప్రాంతానికి సంబంధించి నైన్త్ బ్లాక్ పరిధిలో 9ఏ, 9బీ, 9సీ, 9ఎఫ్‌లో కొంతభాగం కాల్వలు పూర్తి కావాల్సి ఉంది. దమ్మనపల్లె నుంచి ఈదుళ్లపల్లె వరకు కాల్వ నిర్మాణం దాదాపు 3 కి.మీ వరకు జరగాల్సి ఉంది. అయితే దమ్మనపల్లె వద్దనే ఈ పనులు ఆగిపోవడంతో కాల్వ అసంపూర్తిగా మిగిలింది. ఈ కాల్వ పూర్తయి ఉంటే ఇక్కడ దాదాపు 250 ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరందేదని రైతులు చెబుతున్నారు. అలాగే రెడ్డికొట్టాల ప్రాంతంలో కూడా కాల్వలు అసంపూర్తిగా ఉండిపోయాయి. రామాయనపల్లె నుంచి కమ్మవారిపల్లె వరకు లింకు కలిపే కాల్వ కూడా అసంపూర్తిగానే మిగిలిపోయింది. దీనికి తోడు రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరగడం, భూముల ధరలు పెరగడంతో కొందరు రైతులు గతంలో తమ పొలంలో తవ్విన కాల్వలను పూడ్చివేశారు. ఇక సుంకేసులపల్లె వద్ద పిల్లకాల్వలు పెండింగులో ఉన్నాయి. దాదాపు 50 ఎకరాలకు ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం అందించాల్సి ఉంది. ఈ నాలుగు బ్లాక్‌ల కింద దాదాపు 12 నుంచి 15 కి.మీ వరకు పిల్ల కాల్వల పనులు పూర్తికావాల్సి ఉంది.

కాల్వలను పూడ్చేసి వెంచర్‌లు

కొందరు పొలాలను రియల్ ఎస్టేట్‌గా మార్చే క్రమంలో ఉన్న కాలువలను పూడ్చివేశారు. దీంతో నీరు వెళ్లే దారిలేక నిల్వ ఉండటంతో కొన్ని ప్రైవేటు పాఠశాలలు, ఇళ్ల వెనుక వైపు మురుగుకుంటగా మారింది. ఆ చుట్టుపక్కల దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమలకు నిలయంగా తయారైంది. అంతేకాక పందులు స్వైర విహారం చేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కాల్వలను పునరుద్ధరించండి మహాప్రభో అంటూ అధికారులకు విజ్ఞప్తులు చేసినా రాజకీయ కారణాలతో అవి కార్యరూపం దాల్చడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి తెలుగుగంగ పరిధిలో ఉన్న పెండింగు కాల్వలను పూర్తి చేస్తే పొలాలకు నీరందే అవకాశాలున్నాయి. లేనిపక్షంలో ఇవన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోనున్నాయి. ఈ విషయమై తెలుగుగంగ డీఈ క్రిష్టారెడ్డిని వివరణ కోరగా, పెండింగులో ఉన్న కాల్వ పనులను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. నిధులు శాంక్షన్ అయితే పిల్ల కాల్వలను పూర్తి చేస్తామని తెలిపారు.



కాల్వలో పిచ్చిమొక్కలు మొలిచిన దృశ్యం



కాల్వలను పూడ్చయడంతో నీళ్లు వెళ్లే మార్గం లేక ఓ ప్రైవేటు పాఠశాల వెనుక వైపున చెరువును తలపిస్తున్న దృశ్యం

ఎన్ఐఆర్ఎఫ్‌లో వైవీయూకు మెరుగైన ర్యాంకు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: ఏర్పాటైన అనతికాలంలోనే అత్యున్నత ప్రమాణాలు, పరిశోధనలతో ప్రముఖ యూనివర్శిటీగా వైవీయూ గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024లో వైవీయూ 50 నుంచి 100లోపు ర్యాంకులో నిలిచింది. దేశంలో 500కుపైగా యూనివర్సిటీలు ఉండగా అందులో వైవీయూ 50 నుంచి 100 లోపు ర్యాంకు తెప్పించుకోవడం విశేషం. గత ఏడాది 151 నుంచి 200లోగా ఉండగా ఈ ఏడాది అనూహ్యంగా ఉన్నతస్థానం పొందింది. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో వైవీయూ కంటే కేవలం నాలుగు విశ్వవిద్యాలయాలు మాత్రమే ముందుండటం గమనార్హం. ఉత్తమ ర్యాంకు లభించినదుకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ క్రిష్టారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యంశర్మ, అధ్యాపకులు, స్కాలర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఎంచక్కా.. ఎం.బుక్కులు తీసుకెళ్లాడు

● వైసీపీ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఆగస్టు 12: ఆయనో వైసీపీ నేత. వైసీపీ పాలనలో కాంట్రాక్టు పనులు చేశారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉందనుకున్నారేమో.. మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చి ఎంచక్కా ఎం.బుక్కులు తీసుకెళ్లిపోయారు. మైదుకూరు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపిన మేరకు.. వైసీపీ ప్రభుత్వంలో రమేశ్‌రెడ్డి కాంట్రాక్టర్‌గా కొన్ని పనులు చేశారు. వీటికి సంబంధించి కొంతవరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయంటూ ఆయన సోమవారం మున్సిపాలిటీ ఏఈ విశ్వకిరిటీ గదిలోకి అనుమతి లేకుండా వచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్‌ను బెదిరించి ఎం.బుక్కులు ఉండే ఇనుప పెట్టెను స్వయంగా తెరిచి పరిశీలించి తనకు కావలసిన బుక్కులు తీసికెళ్లారు. ఈ మేరకు కంప్యూటర్ ఆపరేటర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. క్రిమినల్ కేసి నమోదు చేయమని సిఫారస్ చేశామన్నారు. ఏఈ విశ్వకిరిటీకి మెమో ఇచ్చామన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డిపై మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



అనుమతి లేకుండా రికార్డులను పరిశీలిస్తున్న కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి



రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: ప్రజా సమస్యలకు బాధ్యతగా పరిష్కారం చూపాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు నాణ్యతతో బాధ్యతాయుతంగా పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన కలిగి... క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో ఈనెల 16 నుంచి 30 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులలో భూసమస్యలపై అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 15 న ప్రారంభించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ అవరణలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారత జాతీయ జెండాతో సెల్ఫీ మరియు సంతాకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌పై సంతకం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటిమీద జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. టూరిజంశాఖ అధికారి నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లాలో ఈనెల 20న నిర్వహించే జాతీయ నుళిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నులి పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అవిష్కరించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ మాత్ర లు పంపిణి చేస్తారని తెలిపారు.

జాతీయ రహదారి పనులు ప్రారంభించాలి

వేంపల్లె, ఆగస్టు 12: కడప-రాజంపేట-రేణిగుంట జాతీయ రహదారి పనులు త్వరగా ప్రారంభించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈరహదారి నిరంతరం రద్దీగా ఉంటుందన్నారు. చెన్నై-ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారిని.. రూ.2254 కోట్లతో, 122 కిలోమీటర్ల పొడవుతో నాలుగు వరుసల రహదారి మంజూరైందన్నారు. 2023 అక్టోబరులో టెండర్ పూర్తి అయి పది నెలలు అయినా.. పనులు మొదలుపెట్టలేదన్నారు. 100హెక్టార్ల అటవీభూమికి సంబంధించి అనుమతిరాని కారణంగా పనులు మొదలుపెట్టలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ఫారెస్ట్ క్లియరెన్స్ తెప్పించి.. త్వరగా పనులు మొదలుపెట్టాలన్నారు. అలాగే వేంపల్లె-రాయచోటి రహదారి విస్తరణ పనులు కూడా త్వరగా పూర్తిచేయాలని, మూడేళ్లుగా ప్రయాణికులు నరకం చూస్తున్నారని తెలిపారు.

క్విజ్ పోటీలలో యువత ప్రత్యక్షంగా పాల్గొనాలి



మాట్లాడుతున్న మణికంఠ

కడప (మారుతీనగర్) ఆగస్టు 12 : 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురష్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్ మీటింగ్ హాల్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో ఆయన మాట్లాడారు. క్విజ్ పోటీలలో యువత ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రధానంగా కరెంట్ ఎఫైర్స్, హిస్టరీ, పాలిటిక్స్, జియోగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, తదితర అన్ని సబ్జెక్టులపై ప్రశ్నలు వుంటాయన్నారు. అన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొనాలన్నారు. క్విజ్‌లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, విజేతలకు నగదు బహుమతితో పాటుగా సర్టిఫికెట్ల ప్రదానం చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9177616677 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12: వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులోని జవహర్ బాలకేంద్రంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనపరిచారు. ఎనిమిది బంగారు పతకాలు, ఆరు రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. శని, ఆదివారాల్లో ఏపీ అమెచ్యూ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 9వ ఇంటర్ స్టేట్ ఇంటర్నేషనల్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సబ్‌జూనియర్ బాలికల విభాగంలో నందిని, జాహ్నవి, సంజన వెండి పతకాలు సాధించగా.. సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఉస్మాన్, ఇర్ఫాన్, అభిరామ్, యువరాం, దీక్షిత్, కార్తవ్యార్జున్‌లు బంగారు పతకాలు సాధించారు. గౌరీశ్వర్, దక్షిత్, శ్రావణ్‌లు వెండి పతకాలు, సంజీవ్, జోగీశ్వర్, సాత్విక, హేమంత్‌లు కాంస్య పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో శివనాథ్, హేమశ్రీలు బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ మాస్టర్ మునీశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రైలుకింద పడి విద్యార్థి ఆత్మహత్య



రాజంపేట, ఆగస్టు 12: రాజంపేట మండల పరిధిలోని హస్తవరం గ్రామ సమీపంలో రైల్‌ట్రాక్‌పై పవన్‌కళ్యాణ్(23) అనే విద్యార్థి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే... రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కలసపాడు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి పవన్ కళ్యాణ్ రెండో సంవత్సరం ఎంసీఏ చదువుతున్నాడు. గత రెండు రోజులుగా పవన్‌కళ్యాణ్ తన స్నేహితులతో ముభావంగా ఉండే వాడని.. సోమవారం ఉదయం పవన్‌కళ్యాణ్ హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లలేదు. కళాశాలకు దగ్గరగా ఉన్న హస్తవరం రైల్వేట్రాక్‌పైకి వెళ్లి రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిసింది. మృతుని తల పూర్తిగా నుజ్జు కావడంతో దుస్తులను బట్టి గుర్తించారు. పవన్‌కళ్యాణ్‌కు తల్లి, తమ్ముడు, అక్క ఉన్నారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట తరలించారు.

ఆలయ హుండీ పగలగొట్టి.. నగదు చోరీ



గాలివీడు, ఆగస్టు 12: మండలంలోని కొర్లకుంట పంచాయతీ భయ్యారెడ్డి గారిపల్లెకు సమీపంలో వెలిసిన మాంకాలమ్మ ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకుల వివరాల మేరకు... సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి పూజ చేయడానికి భక్తులు వెళ్లగా.. హుండీ కనపడకపోవడంతో వెంటనే ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. వెంటనే వారు ఆలయానికి చేరుకొని చుట్టుపక్కల గాలించి.. సమీపంలోని పొలంలో హుండీని గుర్తించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు హుండీలోని నగదును చోరీకి పాల్పడినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీ కేసులో న్యాయం చేయాలి

- జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు

జమ్మలమడుగు, ఆగస్టు 12: జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో సచివాలయం ఎదురుగా ఉన్న 21/1021-6 ఇంటిలో మే 11న దొంగలు చోరీకి పాల్పడి.. 30 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు బాధితులు అన్నలయ్య, అనిత, ఆమె భర్త ఎ.నరసింహాచార్యులు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని.. అయితే 20 తులాలు మాత్రమే చోరీ జరిగిందని అర్బన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై గత నెల 21వ తేదీ కడప జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని.. అదే రోజు అక్కడున్న అధికారులు జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ, ప్రొద్దుటూరు రెగ్యులర్ డీఎస్పీ మురళీధర్‌కు ఫిర్యాదు పత్రాన్ని పంపించారన్నారు. డీఎస్పీ వద్దకు వెళ్లి సమస్యను తెలియజేయగా సీఐ కరుణాకర్‌కు చార్జి మెమో ఇచ్చి.. వెంటనే చోరీకి గురైన బంగారం రికవరీ చేయాలని ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల ఆదేశాలను అర్బన్ సీఐ పట్టించుకోలేదన్నారు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేశామని... ఎస్పీ నేరుగా అర్బన్ సీఐతో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించి విచారణ వేగవంతం చేసి 30 తులాల బంగారు త్వరగా రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

జీతం అడిగినందుకు దళిత మహిళపై దాడి

- పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు



గాయపడిన సుంకేసుల పావని

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 12: జీతం అడిగినందుకు రూంలో వేసి దళిత మహిళను చితకబాది గాయపరిచిన సంఘటన సోమవారం ఒక హోటల్‌లో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.... రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేటలో ఒక హోటల్‌లో దళిత మహిళ సుంకేసుల పావని పనిచేస్తోంది. మూడు నెలల నుంచి హోటల్ యజమాని జీతం ఇవ్వలేదని పావని నిలదీసింది. దీంతో యజమాని హోటల్‌లోని ఒక గదిలో వేసి తలుపులు మూసివేసి విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. జీతం ఇవ్వకుంటే ఇంటిలో జరుగుబాటు ఎలా చేసుకోవాలని హోటల్ యజమా నిని అడిగినందుకు తనపై దాడికి పాల్పడ్డాడని వాపోయింది. హోటల్‌లో జీతం నెలకు రూ.9,500లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ మేరకు యజమా నిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

వేమలూరు రేషన్‌షాపు సీజ్

అట్లూరు, ఆగస్టు 12: మండలంలోని వేమలూరు రేషన్‌షాపును శనివారం జిల్లా అసిస్టెంటు సప్లై అధికారి తారకనాధరెడ్డి సీజ్ చేసి.. నిర్వాహకురాలు చింతకుంట సుప్రజాపై 6ఎ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దారు శివశంకర్ తెలిపారు. మధ్యాహ్న భోజనం బియ్యానికి సంబంధించి 120 బస్తాలు వ్యత్యాసం ఉండడంతో రేషన్‌షాపు సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. స్థానిక వీఆర్‌ఏ చాన్‌బాషాకు రేషన్ షాపును అప్పగించామని తెలిపారు. బద్వేలు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి చంద్ర, అట్లూరు ఇన్స్‌పెక్టరు కరీముల్లా, వీఆర్వో సుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వల్లూరు, ఆగస్టు 12: మండల పరిధిలోని తప్పెట్ల వద్ద కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్బరాయుడు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో సుబ్బరాయుడు కాలు విరిగినట్లు సమాచారం. వాహన చోదకులు గమనించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రూ.కోట్లు ఆశచూపి..కొట్లాట..!

- రూ.2 కోట్ల విలువైన నాణెం ఉందని మాయమాటలు
- కడప నుంచి విజయవాడ రప్పించి ఘర్షణ
- ముగ్గురిని లాడ్జిలో నిర్బంధించి చిత్రహింసలు
- 14 మందిని అరెస్టు చేసిన పోలీసులు

విజయవాడ వన్‌టౌన్, ఆగస్టు 12: కోట్ల విలువైన రామలక్ష్మణ్ నాణెం పేరిట మోసం చేయడమే కాకుండా, ముగ్గురిని కడప నుంచి రప్పించి, నిర్బంధించి, బెదిరించిన ఘటన నగరంలో సోమవారం వెలుగుచూసింది. ఈ కేసులో గవర్నర్‌పేట పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కడపలోని నాగరాజుపేటకు చెందిన రాజేంద్ర మొబైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం తిరుపతిలోని ఒక రెస్టారెంట్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన నరసింహ పరిచయమయ్యాడు. తన వద్ద రామలక్ష్మణ్ కెమికల్ నాణెం ఉందని, అది రూ.2కోట్ల విలువ చేస్తుందని చెప్పాడు. దానికి నగిషీ చేయటానికి రూ.3 లక్షలు అవుతుందని రాజేంద్రను కోరాడు. ఆ తర్వాత వారిద్దరూ మదనపల్లిలో కలిశారు. అనుమానం వచ్చిన రాజేంద్ర.. తనకు నాణెం చూపించాలని నరసింహను కోరాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. ఆ తరువాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అనంతరం వాట్సాప్ ద్వారా నాణెం వీడియోను పంపించిన నరసింహ.. అది కావాలంటే విజయవాడ రావాలని చెప్పాడు. ఇది నమ్మిన రాజేంద్ర మరో ఇద్దరితో కలిసి సోమవారం ఉదయం కడప నుంచి విజయవాడ వచ్చాడు. నరసింహకు ఫోన్ చేయగా, తాను రాయనపాడు చెరువు దగ్గర ఉన్నానని, అక్కడకు రమ్మన్నాడు. గతంలో గొడవపడినప్పుడు తన ఫోన్ తీసుకున్నావని, దానిని ఇవ్వమని నరసింహ.. రాజేంద్రను కోరాడు. దీంతో ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో నరసింహ మరో 14 మందితో కలిసి రాజేంద్రను, అతనితో వచ్చిన ఇద్దరిని కొట్టారు. ముగ్గురిని బలవంతంగా కారులో ఎక్కించుకుని ఓ లాడ్జిలో బంధించి, మళ్లీ కొట్టారు. రాజేంద్ర భార్యకు ఫోన్‌చేసి రూ.30 లక్షలు ఇస్తే వదిలిపెడతామని, లేకపోతే చంపేస్తామని బెదిరించారు. ఈ విషయాన్ని రాజేంద్ర తన బావకు మెసేజ్ చేయగా, ఆయన 112 కాల్ ద్వారా పోలీసులకు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు లాడ్జికి వెళ్లి రాజేంద్రను, అతని స్నేహితులను కాపాడారు. రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహ (26), భవానీపురానికి చెందిన ప్రవీణ్ అలియాస్ సన్నీ (25), దినేష్ (24), విద్యాధరపురానికి చెందిన బూరి రాజేశ్ (25), రాయనపాడుకు చెందిన ధీరజ్ (24), విద్యాధరపురానికి చెందిన సొహైల్ అర్షద్ (23), రాయనపాడుకు చెందిన స్వాగత్ (23), గోనాడ, సీతారామ్, పాండు, నాని, సందీప్, సాంబ, సాయి, సత్య తదితరులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పలువురిపై కేసులు ఉన్నాయి.

వసతిగృహాలపై శ్రద్ధ వహించండి : బీసీ వెల్ఫేర్ డైరెక్టర్



హైడ్రోపోనిక్ నీటి సాగు యూనిట్ ప్రారంభిస్తున్న డైరెక్టరు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 12: వసతిగృహాల పట్ల శ్రద్ధ వహించాలని బీసీ వెల్ఫేర్ డైరెక్టరు మల్లిఖార్జున అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని ప్రభుత్వ బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో ఆయన మమేకమయ్యారు. విద్యార్థుల అభ్యసనా పరిస్థితులు పరిశీలించారు. అనంతరం హైడ్రోపోనిక్ నీటి సాగు యూనిట్‌ను ప్రారంభించారు.

ఈసందర్భంగా విద్యార్థుల సమస్యలు, అవసరాలపై వారితో చర్చించారు. చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు ప్రోత్సాహక వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రోపోనిక్ నీటి సాగు పద్ధతి గురించి వివరించడం ద్వారా పర్యావరణ అనుకూలమైన వ్యవసాయ విధానం మారుతుందని.. ఇది విద్యార్థుల అభ్యాసంలో ప్రత్యేక శక్తిని కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడమే కాకుండా హాస్టలు పరిసరాలను పచ్చదనంతో నింపవచ్చన్నారు. దీంతో పాటు ఆహార పౌష్టిక పెంపొందించడం కూడా సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికితెచ్చారు. కార్యక్రమంలో హాస్టలు సంబంధిత అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సాధికారిక అధికారి ఎన్.భరత్‌కుమార్‌రెడ్డి, సహాయ సంక్షేమ అధికారులు ఆర్.నాగేంద్రరాజు, జ్యోతి పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీపై టీడీపీ నేత దాడికి యత్నం

- సోషల్ మీడియాలో వైసీపీ ప్రచారం
- ఏమి జరగలేదన్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 12: మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నంపై టీడీపీ కౌన్సిలర్ చింతకుంట సరిత భర్త, టీడీపీ నాయకుడు చింతకుంట జయలింగారెడ్డి అసభ్యంగా దూషించి దాడికి యత్నించారని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. దీంతో టీడీపీ వారు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మీద దాడికి యత్నం అవాస్తవమని... వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని సోషల్ మీడియాలో వెల్లడించారు. దీంతో ఈ దాడి యత్నం విషయంపై వాస్తవాలను కమిషనర్ రఘునాథరెడ్డిని వివరణ కోరగా.. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు కౌన్సిలర్ సరిత, ఆమె భర్త జయలింగారెడ్డిలు ఏసీపీ మునిరత్నం రమ్మంటే వచ్చారన్నారు. కౌన్సిల్ సమావేశంలో సరిత నడింపల్లె కాలువను ఆక్రమించి నాలుగు ఇళ్లు నిర్మించడంపై ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వడానికి ఏసీపీ మునిరత్నమే పిలిపించారన్నారు. ఆ నాలుగు ఇళ్లు కాలువపై నిర్మించలేదని.. అక్కడ రికార్డు ప్రకారం కాలువే లేదని.. అది పూర్తిగా పట్టా భూమి అని వెల్లడించారు. వారి పట్టా భూముల్లో నిర్మించి నందువల్ల ప్లాను ఇచ్చామని ఏసీపీ మునిరత్నం తెలిపారన్నారు. దీంతో జయలింగారెడ్డి తాము పిల్లతనం నుంచి చూస్తున్న కాలువను.. కాలువ కాదు పట్టా భూమి అని చెప్పి వారికి ప్లాను ఇచ్చారు కదా.. డాక్యుమెంట్లు ఉన్నాయా అని ప్రశ్నించినట్లు తెలిపారు. 1991 నాటి డాక్యుమెంట్లు స్థలానికి ఉన్నాయని ఏసీపీ తెలిపారన్నారు. లింకు డాక్యుమెంట్లు వున్నాయా అని ప్రశ్నిస్తే లేవని సమాధానం చెప్పారని తెలిపారు. దీంతో మాది మున్సిపల్ కార్యాలయం పక్కన స్థలం వుందని.. ఆ స్థలానికి డాక్యుమెంట్లు ఉన్నాయని.. లింక్ డాక్యుమెంట్లు లేవని మరి ఆ స్థలానికి మీరు ప్లాను ఇవ్వలేదు కదా అని ప్రశ్నించారు. ఏసీపీకి ఇష్టమైన వాళ్లకు ప్లాన్లు ఇస్తారని.. ఇష్టం లేకుంటే సాకులు చెబుతారన్నారు. మున్సిపల్ సర్వేయర్‌తో సర్వే చేయించి అక్కడ రికార్డు ప్రకారం కాలువ వుందా లేదని తేల్చుతామని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఆమేరకు కౌన్సిలర్ సరిత, ఆమె భర్తకు చెప్పి పంపించారన్నారు. అంతే తప్ప ఎలాంటి దౌర్జన్యం దాడి లాంటి యత్నాలు పూర్తిగా అవాస్తమన్నారు.

కొండగంగమ్మకు వెండి ఆభరణాలు వితరణ



వెండి తొడుగులతో ఉన్న కొండగంగమ్మ అమ్మవారు

పెండ్లిమర్రి, ఆగస్టు 13: మండలంలోని నందిమండలం సమీపంలోని కొండపై వెలసిన కొండగంగమ్మ అమ్మవారికి వెండి ఆభరణాలు వితరణగా అందజేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఏసీ గంగయ్య తన కుటుంబ సభ్యులతో కలసి ఈఓ మారుతీ ప్రసాద్‌కు అందజేశారు. రూ.2లక్షల విలువైన 1.986 కేజీల వెండితో తయారుచేసిన వెండి కవచం, పాదాలు, హస్తాలు అమ్మవారికి కానుకగా అందించారు. అలా గే అమ్మవారి గుడి వెనుక భక్తుల కోసం రూ.4.50 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించినట్లు ఈఓ తెలిపారు.


గ్రంథాలయాలు.. సరస్వతీ నిలయాలు



గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న డైరెక్టర్, తదితరులు

వేంపల్లె, ఆగస్టు 12: గ్రంథాలయాలు సర్వతీ దేవి నిలయాలు, విజ్ఞాన బండాగారాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్‌ఎస్ కుమారస్వామి గుప్త అన్నారు. సోమవారం ట్రిపుల్‌ఐటీలో గ్రంథాలయాధికారి కోనప్ప ఆధ్వర్యంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సమయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివి మరింత విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలను గుర్తుచేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి కోనప్పను శాలువ కప్పి మెమెంటో అందించి సత్కరించారు.

గ్రీవెన్స్ సెల్‌లో చేనేత వస్త్రాల కళకళ



గ్రీవెన్స్‌హాల్‌కు చేనేత వస్త్రాలతో వచ్చిన అధికారులు

కడప(కలెక్టరేట్) ఆగస్టు 12: చేనేతలకు భరోసా కల్పించి వారు చేసే ఉత్పత్తులను ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా వాడేలా గత వారం కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో పాటు అధికారులు, మహిళా అధికారిణీలు చేనేత వస్త్రాలు ధరించి హాజరు కావడంతో గ్రీవెన్స్‌సెల్ కార్యాలయం కళకళ లాడింది. కాగా కొందరు అధికారులు మాత్రం చేనేత వస్త్రాలు ధరించకుండా పాత పద్ధతి లోనే కనిపించడం గమనార్హం. చేనేతలను ప్రోత్సహించేలా అధికారులు మరింత చొరవ తీసుకొని కలెక్టర్ ఆదేశాలు తూచా పాటిస్తే, వారి బాటలో మిగతా ఉద్యోగులు కూడా చేనేత ఉత్పత్తులను వాడడమే కాకుండా.. అందరికీ ఆదర్శంగా నిలుస్తారు.

21న ఉపముఖ్యమంత్రి రాక..

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో నిర్వహించే గ్రామ సభకు ఈ నెల 21వ తేదీ హాజరు అవుతున్నారని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రకటనలో తెలిపారు.

ప్రారంభమైన వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు



తనిఖీ చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: వైవీయూ పరిధిలో అనుబంధ డిగ్రీకళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు డిగ్రీ ఐదో సెమిస్టరు పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలల విద్యార్థులు యూనివర్శిటీ కేంద్రంలో హాజరయ్యారు. పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలించారు. అన్ని సౌకర్యాలతో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 12 : పరిసరాలను పరిశుభ్రంగా ఉం చుకోవాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. సోమవారం కమలాపురం ఎంపీడీఓ సభా భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌లదేనన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేసి రోగాలను తెచ్చిపెడుతున్నాయన్నారు. నీరు బయట పారేయకుండా, బయట నిలిచి ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గత ప్రభుత్వం సర్పంచ్‌ల వ్యవస్థను నిర్వీ ర్యం చేసిందన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు సర్పంచ్‌లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తున్నారన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్నామని, సీఎం చంద్రబాబునాయుడు పంచాయతీల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అధికారులు, సర్పంచ్‌లు కలిసికట్టుగా పనిచేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియో గాన్ని తగ్గించాలన్నారు. కమలాపురం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, తాగునీటికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నామని, అందుకోసం నిధులు కేటాయిస్తున్నామన్నారు. యువత తప్పుదారి పట్టకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సా రించాలన్నారు. కాగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ గండి భారతి, ఈఓపీఆర్‌డీ శారద, టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో అవగాహన అవసరం

● ఎమ్మెల్యే మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: విద్యార్థులకు అన్ని రంగాల్లో అవగాహన అవసరమని, ముఖ్యంగా రాజకీయాల్లోకి రావడం ద్వారా ప్రక్షాళన జరుగుతుందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం మున్సిపల్ హైస్కూలులో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అందడంలో ఏఐఎస్ఎఫ్ పాత్రే కీలకమన్నారు. 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఉద్భవించి దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన త్యాగాల సంఘమని కొనియాడారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలన్నారు. సెక్యులర్ స్వేచ్ఛ, సమానత్వం లాంటి అంశాలకు భారత రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం మాజీ నాయకుడు నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వల రాజు, అరుణ్, అకిరానంద్, తేజ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో విద్యార్థులకందించే మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే మాధవి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజ నం పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అలాగే నాణ్య త ప్రమాణాలు కూడా ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టీ డీపీ నాయకులు వికాస్‌హరిక్రిష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎద్దుల రవి, తిరుమలేశ్, మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యాలయాల్లో రాజకీయాలు అమానుషం'

విద్యాలయాల్లో రాజకీయాలు చేయడం అమానుషమని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో రూల్ పొజిషన్‌కు వ్యతిరేకంగా స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలపై ఆమె స్పందించారు. అలాగే స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇంకా జగన్ పాలనలోనే కొనసాగుతున్నట్లు కనబడుతుందన్నారు. ఒక ఔట్‌సోర్సింగ్‌గా ఉన్న ఉద్యోగిని ఎలా స్కూలు కమిటీ ఎన్నికల్లో నియమిస్తారని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం లక్షా 44వేల కన్నా అధికంగా ఆదాయం ఉన్న వ్యక్తులు ఎవరూ ఇటువంటి పోటీల్లో ఉండకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏ విధంగా నియిమించారన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే దీనిపై విచారణకు ఆదేశిస్తామని ఆమె హెచ్చరించారు.

'సమస్యల పరిష్కారం తర్వాతే సర్దుబాటు'

వేంపల్లె, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించిన తర్వాతనే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఎస్టీయూ ఉపాధ్యాయ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్‌లకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. 117జీఓ రద్దు చేయాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయులు కోరుతున్న పలు సమస్యలపై ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా ప్రభుత్వం ముందుకు వెళ్లాలనుకోవడం శోచనీయమన్నారు. అనమ్మతమైన విధానాన్ని వ్య తిరేకిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాప్టోతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెండ్లిమర్రి, ఆగస్టు 12: గ్రామ పంచాయతీలో అభివృద్ధి ప్లాన్ 2024-25 తయారు చేసేందుకు ఎంతో ప్రాముఖ్యత గల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలాధ్యక్షురాలు వరలక్ష్మి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్యలు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సభాభవనం నందు సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు యాక్షన్‌ప్లాన్‌కు సంబంధించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీవి జగన్‌మోహన్‌రెడ్డి, విస్తరణ అధికారి శివరామ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి

కమలాపురం రూరల్, ఆగస్టు 12 : చిరుద్యోగులైన ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, స్కూలు స్వీపర్లు, స్వచ్ఛ భారత్, పంచాయతీ కార్మికులపై రాజకీయ వేధింపులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ కమలాపురం ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు శివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మరియమ్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

కడప (మారుతీనగర్), ఆగస్టు 12: కడప కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు జరగనున్న ఉద్యోగమేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ సూచించారు. ఇందులో కేఎల్ గ్రూప్ (అమెజాన్), కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్టోవింగ్, సోర్టింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ విభాగాలతో పాటు ఎల్ఐసీ విభాగంలో ఆర్ఏసీ, సీసీఏ, ఎల్‌సీఏ విభాగాలలో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో చేరాలనుకునే ఔత్సాహిక అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్‌మీడియట్, ఏదైనా డిగ్రీ, అండ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాలలోపు గల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు 7 వేల నుంచి 20 వేల వరకు స్థాయిని బట్టి వేతనం ఉంటుందన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

కడప (మారుతీనగర్), ఆగస్టు 12: అన్నదానం పుణ్యకార్యమని బీఎస్‌ఆర్ ఫౌండేషన్ వలంటీర్లు మొయిళాకాల్వ శ్రీనివాసులురెడ్డి,హరినారాయణరావు, మాచునూరు హరికృష్ణ పేర్కొన్నారు. రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న వారికి, వారి సహాయకులకు సోమవారం బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో అన్నదానం చేశారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర

వల్లూరు, ఆగస్టు 12 :పంచాయతీల భివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని మండల అభివృద్ధి అధికారిణి జయశ్రీ అన్నారు. సోమవారం ఎంపీడీఓ సభాభవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధికి సంబంధించి ఏమి చేయాలన్నా సర్పంచ్‌లు ప్రధాన భూమిక పోషించాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

సింహాద్రిపురం, ఆగస్టు 12: పంచాయతీ నిధులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ సభాభవనంలో పం చాయతీల అభివృద్ధిపై స ర్పంచులకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో సర్పంచ్ అధికారాలు, విధులపై మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తారన్నారు. ఆ నిధులను క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి ఎలా ఉపయోగించాలి అనే విషయాలపై శిక్షణలో వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం మూడు రో జుల పాటు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, మాస్టర్ ట్రైనర్స్, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

చెన్నూరు, ఆగస్టు 12:పక్కా ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి చేయనున్నట్లు ఏపీ ఎస్ఐఆర్డీ అధికారి రమేశ్ అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణలో భాగం గా స్థానిక మండల పరిషత్ సభాభవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో జరగాల్సిన అభివృద్ధిపై పక్కా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.అభివృద్ధి పనులకు నిధులు ఎలా ఉపయోగించుకోవాలి, మొదటి ప్రాధాన్యత దేనికి ఇవ్వాలనే విషయం తెలుసుకోవాలన్నారు. డీఎల్‌పీఓ ఖాదర్‌బాషా మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్, కార్యదర్శి ఇరువురూ రెండు కళ్లలాంటివారని, ప్రతి పనిని పక్కా ప్రణాళికతో చేప ట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీడీఓ, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి అవసరం: ఎంపీడీఓ

పులివెందుల రూరల్, ఆగస్టు 12: గ్రామాలు అభివృద్ధిబాటలో పయనించేందుకు సమష్టి కృషి అవసరమని పులివెందుల డీఎల్‌డీఓ సురేంద్రనాథ్, ఎంపీడీఓ వెంకటేశ్ అన్నారు. సోమవారం పులివెందుల ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యకర వాతావరణం ఉన్నచోట అభివృద్ధి కార్యక్రమాలు కూడా త్వరగా చేపట్టవచ్చన్నారు.అనంతరం లైట్లు, చెత్తసేకరణ, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. మూడు రోజులపాటుజరిగే ఈ శిక్షణకు తప్పక హాజరుకావాలని సూచించారు. ఈఓపీఆర్డీ, పంచాయతీల సర్పచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలి: ఏఐవైఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కన్వీనరు ఓబయ్య, కో కన్వీనరు హరిక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ కళాశాలలతో పాటు ఎయిడెడ్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేశారని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై పునరాలోచించి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు.


పార్నపల్లె బస్టాండులో దొంగల భయం

పులివెందుల టౌన్, ఆగస్టు 12: పులివెందులలోని పార్నపల్లె బస్టాండ్ అంటే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. పార్నపల్లె బస్టాండ్‌లో ఓ మహిళ పర్సు నుంచి రూ.5వేలు దొంగలించారు. ఇటీవల దాదాపు పదికి పైనే దొంగతనాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. లింగాలకు చెందిన ఓ వ్యక్తి నుంచి వరుసగా మూడు సెల్ ఫోన్లు, లక్ష రూపాయల నగదు వేర్వేరు సమయాల్లో దోచుకెళ్లారు. పార్నపల్లె వైపు వెళ్లే ప్రయాణికులను టార్గెట్ చేసి దోచుకుంటున్నారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే కొంచమైనా ఫలితం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ విషయమై సంబంధిత అధికారులు చొరవచూపాల్సిన అవసరం ఉంది.

'ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల తీరు మారాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: ప్రైవేటు పాఠశాలల యాజామాన్యాల తీరు మారాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ, రవాణాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, వెంటనే దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కనీసం కూర్చోవడానకి నిలబడడానికి కూడా స్థలం లేని విధంగా గుంపులుగా పంపిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారని అన్నారు.

పని సర్దుబాటును రద్దు చేయాలి: ఆపస్



నిరసన కార్యక్రమంలో ఆపస్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12 : అశాస్త్రీయమైన జీఓ 117 రద్దు చేయాలని ఆపస్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి రాగానే జీఓ 117 రద్దుచేస్తామన్న విద్యాశాఖ మంత్రి ఆ శాఖలోనే కొనసాగుతూ అసంబద్ధమైన జీఓ కొనసాగిస్తున్నారని, తక్షణమే ఆ ప్రక్రియ నిలిపివేసి జీఓ నెం.53 ద్వారా పని పర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి, ఆపస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో లోపాలు సవరించాలి : యూటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12: పని సర్దుబాటు ప్రక్రియలోని లోపాలను సవరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు కోరారు. సోమవారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేసే విధంగా ప్రక్రియ ఉందని, జీఓ 117 కానీ, జీఓ 53కాని అనుసరించకుండా ఇష్టానుసారంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం తగదన్నారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులను మిగులు ఉపాధ్యాయులుగా చూపడం సబబుకాదన్నారు. మిగులుగా ఉన్న జూనియర్ ఉపాధ్యాయుల స్థానంలో ఆసక్తికలిగిన సీనియర్లను పని సర్దుబాటులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

సీకేదిన్నె, ఆగస్టు 12: సర్పంచులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈఓపీఆర్‌డీ శ్రీధర్ తెలిపారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్యం, ఘన, ద్రవ వ్యర్థపదార్థాల నిర్వహణ, చెత్త నుండి సంపద తయారీ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాల గురించి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజలకు వ్యాధులు, రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం ఎంపీడీఓగా కృష్ణమూర్తి



బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి

సింహాద్రిపురం, ఆగస్టు 12: సింహాద్రిపురం ఎంపీడీఓగా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తూ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన కృష్ణమూర్తి మళ్లీ సింహాద్రిపురం ఎంపీడీఓగా నియమితులయ్యారు. కాగా ఎన్నికల సమయం నుంచి సింహాద్రిపురంలో విధులు నిర్వహించిన సాల్మన్‌రాజ్ అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఓఎస్డీగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్

కడప (క్రైం), ఆగస్టు 12:రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లురవీంద్రకు ఓఎస్‌డీగా కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గోపాల్‌ను నియమించినట్లు తెలుస్తోంది. ఒకటిన్నర సంవత్సరం క్రితం గోపాల్ కడప సూపరింటెండెంట్‌గా వచ్చారు. కాగా ఈ మేరకు అధికార ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి.

ముస్తాబవుతున్న పోలీసు పరేడ్ గ్రౌండ్

కడప (క్రైం), ఆగస్టు 12 : ఆగస్టు 15న గురువారం ఘనంగా జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పోలీసు కవాతు రిహార్సల్స్‌ను కడప నగరంలోని జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. పరేడ్ రిహార్సల్స్‌లో భా గంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గౌరవవందనం స్వీకరించారు. అనంతరం కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. కవా తు పరిశీలన వాహనంలో ఎస్పీ వెళ్లి పో లీసులు, హోంగార్డులతో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల కవాతును పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు గ్యాలరీల ఏర్పాటు, కల్పించాల్సిన భద్రత ఏర్పాట్లను, సౌకర్యాలను గురించి సమీక్షించి జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలీ సు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇతర శా ఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ ఎఆర్ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఆర్‌ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సేవలు మరువలేనివి

చెన్నూరు, ఆగస్టు 12 : విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసిన ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ పుల్లయ్య సేవలు మరువలేనివని ఏఎస్ఐలు జాకీర్‌హుసేన్, రామచంద్రయ్య అన్నారు. చెన్నూరులో సుమారు ఐదేళ్ల పాటు ఎస్‌బీలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన చిత్తశుద్ధితో విధులు నిర్వహించారన్నారు. ఆయ న సీకేదిన్నె మండలానికి బదిలీపై వెళుతున్నారన్నారు. విధి నిర్వహణలో ఎక్కడ పనిచేసినా ఆయన సేవలు గొప్పగా ఉంటాయని సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు వెంకట్రాముడు, శ్రీరాములు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి : సీఐ

వేంపల్లె, ఆగస్టు 12:ప్రశాంత జీవనంసాగించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. రౌడీషీటర్లకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నచిన్నగొడవలను పెద్దవిగా చేయవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని హెచ్చరించారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలి

పులివెందుల టౌన్, ఆగస్టు 12: ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జండా ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు పులివెందులలో హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ 13 నుంచి 15వ తేదీ వరకు ఇళ్లపై త్రివర్ణపతాకాన్ని ఎగురవేయాలన్నారు. త్రివర్ణపతాకంతో దిగిన సెల్ఫీలను హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీజిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు జయభరత్‌రెడ్డి, నాయకులు,కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుద్యోగులను ఇబ్బందిపెట్టడం తగదు



వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

వేంపల్లె, ఆగస్టు 12: వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న చిరుఉద్యోగులను ఇబ్బంది పెట్టడం తగదని కార్మిక నాయకులు అన్నారు. సోమవారం తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, ఉపాధి హామీ పథకం, డ్వాక్రా సంఘాల లీడర్లు, మంచినీటి పథకం కార్మికులు, పంచాయతీ,మున్సిపల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్వచ్ఛభారత్‌లలో కార్మికులను మానుకోవాలని బెదిరించడం సరికాద న్నారు. ఏఐటీయూసీ, భవననిర్మాణ కార్మిక సంఘం, అంగన్వాడీ వర్కర్ యూనియన్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్, స్వచ్ఛభారత్ కార్మిక యూనియన్, సివిల్ సప్లై, హమాలీ వర్కర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

● ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రాకేశ్‌చంద్రన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 12 : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కమిషనర్ కె.రాకేశ్‌చంద్రన్ సూచించారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 22 అర్జీలు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10అర్జీలు, టౌన్‌ప్లానింగ్ 7, రెవెన్యూ విభాగం 4, హెల్త్ విభాగం 1 వచ్చిందన్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖాధిపతులకు పంపించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదని, కేటాయించిన సమయానికి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ రత్నాలరాజు, సిటి ప్లానర్ సూరజ్, హెల్త్ ఆఫీసరు చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గన్నారు.

ఘనంగా అక్కదేవతల పూజ



అక్కదేవతల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

సింహాద్రిపురం, ఆగస్టు 12: సింహాద్రిపురంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో సోమవారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహాద్రిపురం పుర వీధులలో అక్కదేవతల ప్రతిమలు, కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అక్కదేవతలను దర్శించుకున్నారు.

నేడు ఓపెన్ ఫోరం

చాపాడు, ఆగస్టు 12: చాపాడులోని ఉపాధి కార్యాలయంలో ఈనెల 13న ఉదయం 10.30 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి బహిరంగ సామాజిక తనిఖీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీవో జగదీశ్ తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 7.30 కోట్ల రూపాయలతో పలు రకాల అభివృద్ధిపనులు చేపట్టడం జరిగిందన్నారు. కడప డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీలు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బి.కోడూరు, ఆగస్టు 12 : గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్ వర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సగిలేరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఐదోతరగతి నుంచి 8వ తరగతి, ఇంటర్ మొదటిసంవత్సరం బైపీసీ ,ఎంపీసీ మిగిలిన సీట్లకు ఎస్సీ విద్యార్థులకు ఆగస్టు 17తేదీలోపు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో చేరే విద్యార్థులు ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరై ప్రవేశం పొందవచ్చన్నారు.

25 గోకులం షెడ్లు మంజూరు

చాపాడు, ఆగస్టు 12 : ప్రభుత్వం మండలానికి 25 గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్ తెలిపారు. రైతులు గేదెలు, పొట్టేళ్లు, కోళ్లఫారాల పెంపకం కోసం ఈ షెడ్లు నిర్మించుకోవచ్చన్నారు. గేదెల షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ 90 శాతం, మిగతా వాటికి 70 శాతం చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. గేదెల షెడ్లు నిర్మించే ఒక యూనిట్ విలువ రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు ఉందన్నారు. గొర్రెలు, పొట్టేళ్లకోసం ఒక్కో యూనిట్ విలువ రూ.1.30 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు ఉందన్నారు. కోళ్లఫారాల కోసం రూ.87 వేల నుంచి రూ.1.32 లక్షల వరకు ఉందన్నారు. రైతులు వారికి సంబంధించిన ఆధార్‌కార్డులు, స్థలం డాక్యుమెంట్లు, బ్యాంకు పాస్‌పుస్తకాలు వంటివి దరఖాస్తు ఫారానికి జోడించాలన్నారు.

చాపాడు ఎస్ఐగా చిన్న పెద్దయ్య



చాపాడు, ఆగస్టు 12: చాపాడు మండల ఎస్ఐగా చిన్న పెద్దయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కొండారెడ్డిని జిల్లా అధికారులు పోరుమామిళ్లకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఓబుళవారిపల్లెలో పనిచేస్తున్న చిన్న పెద్దయ్యను నియమించారు.

పాలనపై సర్పంచులకు అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ,ఆగస్టు 12 : పంచాయతీ వ్యవస్థ మీద సర్పంచులు పట్టుపెంచుకున్నప్పుడే ప్రజలకు మంచి పరిపాలన అందించగలమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో మూడు రోజుల పాటు సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో విధులు బాధ్యతలు ప్రతి సర్పంచ్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో విజయభాస్కర్, ఎంపీడీవో కుళాయమ్మ, ఈవోపీఆర్డీ రామాంజనేయరెడ్డి,ఏవో బాలన్న, సినీయర్ అసిస్టెంట్ క్రిష్ణ కుమారి పాల్గొన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీగా పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించారు.

కాశినాయన..: గ్రామ పంచాయతీల అభివృద్ధికోసం సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ పక్కాప్రణాళికలతో ముందుకు సాగాలని ఈవోపీఆర్డీ ముజఫర్ రహీమ్ పేర్కొన్నారు.సోమవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో సర్పంచ్‌లకు,సెక్రటరీలకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనర్‌లు రామక్రిష్టారెడ్డి,ప్రసాద్ గ్రామాల్లో త్రాగునీరు,పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులకు అవగాహన పరిచారు. పలువురు పంచాయతీ సర్పంచ్‌లు సెక్రటరీలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: చట్టాలపై అవగాహన పెంచుకుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో వరప్రసాదరావు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఈవోపీఆర్‌డీ రాజీవ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా అన్నారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖర్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమలసుధాకర్, రంగసముద్రం చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెం..: గ్రామ పంచాయతీల పాలనపై సర్పంచులు అవగాహన పెంచుకుని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని ఎంపీడీవో షాకీర్ ఆలీఖాన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సభాభవనంలో గ్రామ పంచాయతీల పరిపాలనపై సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. సర్పంచ్‌లు ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, విద్య, రోడ్లు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి , సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలోని 11 పంచాయతీల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు చేపట్టారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మూడు రోజులపాటు ఖాజీపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ ఆర్‌జీఎస్‌ఏ ప్రణాళిక గురించి వివరించడంతోపాటు వీధిలైట్లు, సాలీడ్‌వాటర్ మేనేజ్‌మెంట్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో శంషద్ బేగం అన్నారు. సోమవారం మైలవరం ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో మూడు రోజుల పాటు జరిగే గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులు, గ్రామ పంచాయతీ అదికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మాదవరెడ్డి, శ్రీధర్, సీఓటీలు బాలక్రిష్ణ, శివ, పవన్, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలి

కొండాపురం, ఆగస్టు 12: రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో ఏపీ రామాంజులరెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డితో కలిసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఆర్వో, వీఏఏలు గ్రామంలోని ప్రతి సర్వే నంబరు తిరిగి గడువులోపు ఈ-క్రాప్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో తెలిపారు. అదేవిధంగా డ్రిప్, స్ప్రింక్లర్స్ కావలసిన రైతులు రైతుసేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ వీఆర్వోలు, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

చిరుద్యోగులను బెదిరించడం తగదు

బద్వేలు, ఆగస్టు12: గత ప్రభుత్వంలో నియమితులయ్యారన్న సాకుతో వివిధ ప్రభుత్వ స్కీములైన ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం వంటి తదితర చిరుద్యోగులను తొలగించే విధానాలకు స్వస్తి పలకాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఈ మేరకు తహశీల్దారు ఉదయ భాస్కర్ రాజుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మమ్మ, సునీత, యూనియన్ నాయకులు ఓబయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కార్మికులపై బెదిరింపులు మానుకోవాలని ఏఐటీయూసీ నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశా, డ్వాక్రాసంఘాల లీడర్లు స్వచ్ఛభారత్ కార్మికులు మానుకోవాలని బెదిరింపులు చేయడాన్ని స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవకు యువత నడుం బిగించాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 12 : సమాజ సేవ చేసేందుకు యువత నడుం బిగించాలని రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో మార్కారెడ్డి అన్నారు. సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాశరావు అధ్యక్షతన అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సామాజిక సేవ చేస్తున్న యువకులను సన్మానించారు. కార్యక్రమంలో రంగసముద్రం ఎంపీటీసీ, టీడీపీ నాయకులు కల్వకూరి రమణ, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.గురుమూర్తి, రోడ్‌సేఫ్టీ రాష్ట్ర డైరెక్టరు శివశంకర్, మదర్‌థెరిస్సా ఫౌండేషన్ డైరెక్టర్ గిరి ప్రణీత్‌రెడ్డి, అధ్యాపకులు సులోచన వెంకటరావు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జీతాలివ్వకనే ఆసుపత్రిలో కార్మికులతో పారిశుధ్య సేవలు తగదు



జిల్లా ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 12 : ఐదునెలలుగా జీతాలివ్వకనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల తో పారిశుధ్య సేవలు చేయించుకోవడం ఆసుపత్రి అధికారులకు తగదని సీఐటీయూ జిల్లాకార్యదర్శి సత్యనారాయణ తప్పుబట్టారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద ఐదునెలలుగా జీతాలివ్వక పోవడం పై కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌డాక్టర్ సీపీ ఆనంద్ బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, కార్యదర్శి రాఘవ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

భూములు ఆన్‌లైన్ చేయండి

అట్లూరు, ఆగస్టు 12 : మండలంలోని నల్లాయపల్లెభూములు కమలకూరు, కాటంవారిపల్లె, పాటిమీదపల్లె, మలినేనిపట్నం ముంప్రు గామస్థులకు 20 సంవత్సరాల క్రితం పేదలకు ఇచ్చిన భూములు ఆన్‌లైన్ ఇంత వరకు చేయలేదని ఆ భూములను ఆన్‌లైన్ చేయాలని మండల టీడీపీ నాయకుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి సోమవారం తహసీల్దారు శివశంకర్‌ను కోరారు. నల్లాయపల్లెలో ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా, టీడీపీ నాయకులు ఎం.మహేశ్వర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనదారుడికి స్వల్పగాయాలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 : బి.మఠం మండలంలోని టి.చౌదరివారిపల్లె, గుండాపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలు పట్టణానికి చెందిన పుల్లయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో పుల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా స్థానికులు 108 వాహనానికి ఫోను చేసి బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్లయ్య వెంట ఓ బాలుడు కూడా ఉన్నట్లు తెలిపారు.

డాడీ హోం అనాథ పిల్లలకు న్యాయం చేయాలి

ట్రస్టును తిరిగి అనాథ పిల్లల పేరిట మార్చేలా చర్యలు తీసుకోవాలి

ప్రజా పక్షం డిమాండ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 12 : రాజా ఫౌండే షన్‌కు చెందిన డాడీ హోం అనాథపిల్లలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రజా పక్షం కన్వీనర్ న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాం డ్ చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డికి డాడీ హోం అనాథపిల్లలకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ డాడీ హోం ట్రస్టును అనాథపిల్లలకు రాయించాడనే అక్కసుతో రాజారెడ్డిని అతిదారుణం గా హత్యచేశారన్నారు. ఆ హత్యతో భయాందోళనకు గురైన అనాథపిల్లలు వారిని భయపెట్టి కొందరు వారిపేరుమీదున్న ట్రస్టును తమ పేర్ల మీద రాయించుకున్నారన్నారు. కానీ నాటి నుంచి అనాథపిల్లల బాగోగులు పట్టించుకోకుండా వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అనాథల కోసం సేకరించిన డబ్బులను అక్రమంగా వాడుకున్నారన్నారు. వీటిని సాక్ష్యాలతో సహా అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, తహసీల్దారు పిలుపుమేరకు వారికి నివేదిక కూడా అందజేశామన్నారు.

అందరూ మెచ్చుకునేలా రాణించాలి

● జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి

కాశినాయన ఆగస్టు12: జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులు మెచ్చుకొనేలా జీవితంలో బాలికలు రాణించాలని బద్వేల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ తరుపున సోమవారం వరికుంట్ల సమీపంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులు, భోజనం తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి వారికి దిశానిర్దేశం చేశారు..ఈకార్యక్రమంలో పాఠశాల ఏఎస్‌వో మెర్సీరాణి,ఏఎస్ఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న దొరసానివీధి

● నిలిచిపోయిన పాత డంపింగ్‌యార్డులో పనులు



గుట్టలుగా పేరుకుని కంపుకొడుతున్న వ్యర్థాలు



జమ్మలమడుగు, ఆగస్టు 12: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దొరసాని వీధి కంపుకొడుతోంది. రోడ్డు పక్కనే పెన్నానది సమీపాన పట్టణంలోని వ్యర్థాలన్నీ పడవేయడంతో దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతోంది. ఆ రోడ్డున సమీపాన ఉన్న ప్రజలకు రోగాల పుట్టగా మారింది. పగలే దోమలు, పందులు, స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు రోగాలభారిన పడి విషజ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత డంపింగ్ యార్డు ఆవరణలో పట్టణంలోని డ్రైనేజీ నీరు ఫిల్టర్ చేసేందుకు తవ్విన గుంత పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలోని వ్యర్థాలన్నీ రోడ్డుపైకి చేరాయి. రెండు నెలల నుంచి పడమరవైపు నుంచి వీచే గాలితో వచ్చే దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ కాలువ నిర్మాణం లేక నీళ్లన్నీ సిమెంటు రోడ్డు తగ్గుభాగంలో చేరి రోడ్డు కుంగుతోంది. మున్సిపల్ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించికంపు, డ్రైనేజీ వ్యర్థాలు అందులో నిలిచిపోయిన పనులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అసంబద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు'



కలసపాడులో నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నేతలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 12: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని ఫ్యాప్టో నాయకులు సోమవారం ఇన్‌చార్జి ఎంఈవో శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు సూచించిన ఏ విషయాన్నీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదన్నారు. విద్యాశాఖాధికారులు ఉన్నపళంగా పని సర్దుబాటు పక్రియ చేపట్టడం తగదన్నారు. ప్రభుత్వం ఏకపక్ష వైఖరికి నిరసనగా సర్దుబాటు ప్రక్రియను బహిష్కరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, నాగరాజు, ఎస్టీయూ నాయకులు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరెడ్డి, ఎంటీఎఫ్ నాయకుడు రఫీవుద్దీన్, ఏపీటీఎఫ్ నాయకులు సయ్యద్‌బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలసపాడు..: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధతతో ఉన్నందున ఉపాధ్యాయ సంఘాలుగా సర్దుబాటును బహిష్కరిస్తున్నామని ఏపీఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర నేత పి.రమణారెడ్డి అన్నారు. సోమవారం కలసపాడులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఎంఈవోలు, ప్రేమసాగర్, మస్తాన్‌వలికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు శేఖర్‌బాబు, బాలజోజి, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, రామక్రిష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, గురవయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఉపాధ్యాయ సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తామని ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ సురేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం పోరుమామిళ్ల ఏపీటీఎఫ్ రీజనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్పీ స్కూళ్లలో ప్రమోషన్ ఇచ్చి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం వల్ల ప్రైమరీ స్కూళ్లు బలోపేతం అవుతాయన్నారు. గత పాలకులు చేసిన 117 జీవో రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడంలో చాలా లోపాలున్నాయని, వాటిని వెంటనే వాయిదా వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఏ సత్తార్, రమణారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, శేషారెడ్డి పాల్గొన్నారు.

పరిహారం ఇస్తారా - భూములు తిరిగి ఇస్తారా..?

● స్టీల్‌ప్లాంట్ బాధిత రైతులు



ఆర్డీవో కార్యాలయం ఎదురుగా పెద్దదండ్లూరు రైతులు నిరసన

జమ్మలమడుగు, ఆగస్టు 12: పరిహారం ఇస్తారా - భూములు వెనక్కు ఇస్తారా..? అని జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం స్టీల్‌ప్లాంట్ బాధిత పెద్దండ్లూరు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదురుగా బాధిత రైతులు నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. 2018లో జగన్‌మోహన్‌రెడ్డి 2019లో తనకు అధికారం ఇస్తే స్టీల్ ప్లాంట్ నిర్మించి రైతులు, చుట్టుపక్కల గ్రామాల నిరుద్యోగులకు ప్రయోజనం చేకూర్చుతామని ఆశ చూపించి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవ్వరి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. రెండుసార్లు జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లె కన్యతీర్థం గ్రామాల మధ్య శిలాఫలకాలు వేశారన్నారు. ఏ ఒక్కరోజు కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా స్టీల్‌ప్లాంట్ బాధిత రైతులపట్ల అదిగో పరిహారం, ఇదిగో పరిహారం అంటూ మోసం చేశారన్నారు. ప్రస్తుతం 2024లో కూటమి ప్రభుత్వమైనా స్టీల్‌ప్లాంట్ బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో శ్రీనివాస్‌కు ఆ గ్రామ సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో కలిసి డిమాండ్ చేశారు. ఏడాది క్రితం తమ వద్ద భూములకు సంబంధించి ఆధారాలు అధికారులు తీసుకున్నారన్నారు. తమకు పరిహారం ఇస్తారా, లేక భూములు, పాస్‌పుస్తకాలు వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో శ్రీనివాస్ ఈ సమస్య తన వద్ద లేదని, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళతానని బాధిత రైతులకు తెలియజేశారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి:తహసీల్దారు

కాశినాయన ఆగస్టు12: ప్రజలనుంచి వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని తహసీల్దారు బాలనరసింహ అధికారులకు సూచించారు. సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో సమస్యల పరిష్కార ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా పలురకాల సమస్యలపై ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. కాగా ఈకార్యక్రమంలో విధిగా అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించినా మెజార్టీ శాఖల అధికారులు గైర్హాజరవడం గమనార్హం

బి.మఠం ఎంపీడీఓగా వెంగమునిరెడ్డి



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 : బ్రహ్మంగారమఠం మండలం ఎంపీ డీఓగా సోమవారం టి.వెంగముని రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శివమల్లేశ్వరప్ప బదిలీపై సొంత జిల్లా కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కర్నూలులో పనిచేస్తున్న ఎంపీడీవో వెంగమునిరెడ్డి బ్రహ్మంగారిమఠం ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పోరుమామిళ్ల ఎస్ఐగా కొండారెడ్డి



పోరుమామిళ్ల, ఆగస్టు 12 : పోరుమామిళ్ల ఎస్ఐగా కొండారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పోరుమామిళ్లలో విధులు నిర్వహిస్తున్న తిమోథి బదిలీ కావడంతో చాపాడులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కొండారెడ్డి సోమవారం పోరుమామిళ్లలో బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు.